'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

• అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి, మార్చి 6 : పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న పదోతరగతి విద్యార్థుల పరీక్షల సన్నద్ధతపై సంబంధిత అధికారులతో వెబ్ ఎక్స్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇప్పటికే స్టడీ మెటీరియల్ అందిందని, వారికి చదవడంలో ఏవైనా సందేహాలుంటే ఉపాధ్యాయులు నివృత్తి చేయాలని సూచించారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆంగ్లం, హిందీ, గణితంపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఆహార నియమాలు పాటించాలని, ఏవైనా చిన్న, చిన్న ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి జాగ్రత్తలు పాటించాలన్నారు. సమావేశంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నుషిత, ఏఎస్పీడీవో మల్లేశం, సూపరింటెండెంట్, హెచ్‌డబ్ల్యూవోలు, ట్యూటర్లు పాల్గొన్నారు.

పన్నులు వంద శాతం వసూలు చేయాలి

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లోని వాణిజ్య, ఆస్తి పన్నులను అధికారులు వందశాతం వసూళ్లు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ చాంబర్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లతో ఆస్తి, వాణిజ్య పన్నులపై బుధవారం అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ పన్ను వసూళ్లలో అధికారులు, సిబ్బంది ఆలసత్వం వహించరాదన్నారు. అదేవిధంగా వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా నీటి లభ్యతను నిర్ధారించుకొని అందుకు తగ్గటు ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా మున్సిపాలిటీ బస్టాండ్లు, ఇతర రద్దీ ప్రదేశాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీ పార్కుల్లో పక్షులు, ఇతర మూగ జీవుల కోసం నీటి కుంటల ఏర్పాట్లు చేయాలని, నర్సరీల్లో లక్ష్యానికి తగ్గట్టుగా మొక్కల లభ్యతను ఏర్పాట్లు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు మున్సిపాలిటీ వార్డులో ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత మున్సిపల్ కమిషనర్లు, డీఈలు, ఏఈలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి, వాణిజ్య పన్ను వసూళ్లపై మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

కార్యకర్తకు అండగా బీఆర్ఎస్

• మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

ప్రమాదబీమా చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్, మార్చి 6: నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన కార్యకర్తను కాపాడడానికి బీఆర్ఎస్ అండగా నిలుస్తున్నదని మాజీఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. పాన్‌గల్ మండలంలోని బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దొంతన మోని నాగన్న నాలుగునెలల కిందట గ్రామసమీపంలోని చెరువులో చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుడికి బీఆర్ఎస్ పార్టీలో సభ్యత్వం ఉన్నందున రూ.2లక్షల ప్రమాదబీమా చెక్కు మంజూరైంది. బుధవారం కొల్లాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బీమా చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ వెంకటయ్య నాయుడు, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, మిద్దె కృష్ణ, నాయకులు రవీందర్‌గౌడ్, దశరథ్ నాయుడు, హనుమంతురెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

వనపర్తి సంపూర్ణ అభివృద్ధికి నావంతు కృషి

ఆత్మీయ సన్మాన సభలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

వనపర్తి టౌన్/గోపాల్‌పేట, మార్చి 6 : వనపర్తి సంపూర్ణ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టాక బుధవారం మొదటిసారిగా వనపర్తికి వస్తుండడంతో ఆత్మీయ సన్మాన సభను కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ముందుగా చిన్నారెడ్డి బుద్ధారం గండి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి జిల్లా కేంద్రంలోని చేరుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాగవరంలోని పద్మావతి గార్డెన్‌లో నిర్వహించిన సన్మాన సభలో ఆయన మాట్లాడారు. కాగా ఎమ్మెల్యే మేఘారెడ్డి సన్మాన సభకు హాజరు కాకపోవడంతో చిన్నారెడ్డి ఎమ్మెల్యే ప్రస్తావన లేకుండా సభలో మాట్లాడారు. దీంతో అక్కడికి వచ్చిన ప్రజలు, శ్రేణులు కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాలుగా కొనసాగుతున్నాయని చర్చించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, శంకర్‌ప్రసాద్, కిరణ్‌కుమార్ ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే రాజ్యాధికారం సాధ్యం

• బీఎస్పీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి కేశవరావు

ఉండవెల్లి, మార్చి 6: రాజ్యాధికారం బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందనే బీఎస్పీ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తు పెట్టుకోవడం జరిగిందని బీఎస్పీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి కేశవరావు పేర్కొన్నారు. మండలంలోని అలంపూర్ చౌరస్తాలోని బీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షంగా ఉన్న పార్టీలు బలపడితేనే అధికార పార్టీని ప్రశ్నించి ప్రజల పక్షాన నిలబడడానికి వీలవుతుందన్నారు. కొంతమంది అవగాహన లేనివారు పొత్తును వ్యతిరేకిస్తున్నారని బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు వారి మాటలను పట్టించుకోవద్దన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఏ నిర్ణయం తీసుకున్నా రాష్ట్ర భవిష్యత్, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుంటారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ, బీఆర్ఎస్ ఉమ్మడి అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కేశవరావు

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

వనపర్తి టౌన్, మార్చి 6: ఈనెల 8న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వనపర్తి డిపో నుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం వేణుగోపాల్ తెలిపారు. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు 15 ప్రత్యేక స్పెషల్ బస్సులను నడుపుతున్నామని, ఎక్స్‌ప్రెస్ చార్జి రూ.390, డిలక్స్ చార్జి రూ.440 గా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక బస్సులను పెంచుతామని తెలిపారు.

మరమ్మతుల్లో జీపీ ట్రాక్టర్

గట్టు, మార్చి 6 : గట్టు గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ దూరమై పదిహేను రోజులవుతున్నది. మరమ్మతులకని చెప్పి ట్రాక్టర్‌ను జిల్లా కేంద్రంలోని ట్రాక్టర్ షోరూంకు తరలించారు. అయితే కాలం గడుస్తున్నా.. ట్రాక్టర్ మరమ్మతులు పూర్తికావడంలేదు. దీంతో మండల కేంద్రంలోని వీధుల్లోని చెత్తాచెదారం ఎక్కడికక్కడ పేరుకుపోయింది. పారిశుధ్య కార్మికులు ఊడ్చిన చెత్తను ఎక్కడికక్కడ నిల్వ ఉంచుతున్నారు. ట్రాక్టర్ లేకపోవడంతో చెత్త పేరుకుపోతోంది. కాగా చెత్తను తీసుకెళ్లాలని స్థానికులు పారిశుధ్య కార్మికులను నిలదీస్తున్నారు. ట్రాక్టర్ లేకపోవడంతో కార్మికులు ఏం చేయలేకపోతున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి ట్రాక్టర్‌కు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. కాగా నిధులు సమకూరకపోవడంతో ట్రాక్టర్‌ను తీసుకోవడం లేదనే ఆరోపణలు వినివస్తున్నాయి.

నేటినుంచి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు

అయిజ, మార్చి 6: భ్రామరీ సహిత మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలకు వేళాయే. మండలంలోని సింధనూర్‌లో ఏటా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటకకు సరిహద్దుగా సింధనూర్ గ్రామం ఉండడంతో భక్తులు అధికసంఖ్యలో తరలిరానున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని శివరామాంజనేయస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. గురువారం ఉదయం 7గంటలకు పందిరి నిర్మాణం, గణపతి పూజ పుణ్యాహవచనం, రుద్రాభిషేకం, మహా మంగళహారతి, తీర్థప్రసాదం వితరణ, శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం 6గంటలకు పరమశివుడికి పంచామృతాభిషేకం, మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం గోధూళివేళ రుద్రాభిషేకం, రాత్రి 8గంటలకు ఆది దంపతుల కల్యాణం నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 6 గంటలకు రుద్రాభిషేకం, మహామంగళహారతి, తీర్థప్రసాదం వితరణ, సాయంత్రం 5 గంటలకు రథాంగహోమం, కుంభబలి, కుష్మాండ బలి, రథోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవాల పురస్కరించుకొని పారిశ్రామిక వేత్త మూలగుండం శివరామ కృష్ణస్వామి ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 10న అంతర్రాష్ట్ర ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్, సందెరాళ్లు ఎత్తు పోటీలు నిర్వహిస్తున్నారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నారు.

ముస్తాబైన శివరామాంజనేయస్వామి ఆలయం

మేధోసంపత్తి హక్కుల కేంద్రాలుగా ఎదగాలి

పెద్దమందడి, మార్చి 6 : విశ్వవిద్యాలయాలు మేధో సంపత్తి హక్కుల కేంద్రాలుగా ఎదగాలని ఉద్యానవర్సిటీ హార్టికల్చర్ డీన్ రాజశేఖర్ అన్నారు. మండలంలోని మొజర్ల ఉద్యాన కళాశాలలో ఉద్యాన విశ్వవిద్యాలయం, ఐపీఆర్‌సెల్, తెలంగాణ రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ సంయుక్తగా ఇంటలెక్చువల్ ప్రాపర్టీ కార్యక్రమంలో భాగంగా బుధవారం సెమినార్‌లో వక్తలు మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ పరిశోధనలో సృజనాత్మకత అంశాలు రైతులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారానికి వెతికే దిశగా పరిశోధన చేపట్టాలని సూచించారు. అదేవిధంగా రిసోల్యూట్ గ్రూప్ ఫర్ ఐపీ సంస్థ లీగల్ , ఐపీఆర్ హెడ్ సుభాజిత్ పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ పిడిగం సైదయ్య, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారం మరువలేనిది

వనపర్తి టౌన్, మార్చి 6 : పూర్వ విద్యార్థుల సహకారం, ప్రోత్సహం మరువలేనిదని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తారాబాయి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చదివిన ఎన్ఆర్ఐ వడ్డెమాన్ గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి రూ.3లక్షల విలువగల 75 డ్యూయల్ డెస్క్ బెంచీలను బుధవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతోపాటు పూర్వ విద్యార్థుల సహకారం, ప్రోత్సాహం పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు తోడ్పాటునందిస్తాయన్నారు. డ్యూయల్ డెస్క్ బెంచీలను వితరణ చేసిన పూర్వ విద్యార్థికి ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా కల్యాణోత్సవం

పాన్‌గల్, మార్చి 6 : మండలంలోని తెల్లరాళ్లపల్లిలోని వీరభద్ర సమేత శివాలయంలో బుధవారం వెంకట్‌చరణ్ స్వామి ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులు ఉదయం సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, కల్యాణోత్సవం, మంగళహారతులు, తీర్థప్రసాదవితరణ, అన్నదానం కార్యక్రమం, శివపార్వతుల ఊరేగింపు తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు ఆనంద్, కిశోర్ యాదవ్, హరీశ్, మల్లేశ్, కృష్ణయ్య, దినేశ్, ధర్మయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 274మంది గైర్హాజరు

వనపర్తి టౌన్, మార్చి 6 : జిల్లావ్యాప్తంగా బుధవారం నిర్వహించిన ఇంటర్ మ్యాథ్స్, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు 274మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 4,800 మందికి గానూ 4,614 మంది హాజరు కాగా 186 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,187మంది విద్యార్థులకు గానూ 1,099 మంది హాజరు కాగా 88 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 5,987 మందికి గానూ 5713 మంది విద్యార్థులు హాజరు కాగా 274మంది గైర్హాజరైనట్లు డీఐఈవో మద్దిలేటి తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి డాక్టరేట్

వనపర్తి టౌన్, మార్చి 6 : జిల్లా కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు అనంతప్ప డాక్టరేట్ పొందాడు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత రిటైర్డ్ హెచ్ఎం అనంతప్పకు గ్లోబల్ హూమన్ రైట్స్ ట్రస్ట్ వారు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. హైదరాబాద్ ఎమ్మెల్యే మాల్‌రెడ్డి రంగారెడ్డి, గ్లోబల్ హూమన్ రైట్స్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ హెచ్ఆర్ రెహమాన్‌తో పాటు బోర్డు కార్యదర్శి పరమాజిత్‌సింగా చేతులమీదుగా అవార్డును పొందారు.

అవార్డు అందుకుంటున్న అనంతప్ప

అలంపూర్‌లో కొనసాగుతున్న ఉత్సవాలు

అలంపూర్, మార్చి 6: జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లోని మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు ఆలయాల్లో విశేష పూజలు కొనసాగాయి. ఓవైపు రుత్వికులు హోమాలు నిర్వహించగా.. మరోవైపు జోగుళాంబ ఆలయంలో ఉదయం 11గంటల నుంచి 4గంటల వరకు అష్టబంధన కార్యక్రమాన్ని పండితులు వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేడు ధ్వజారోహణం

మహ శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో మొదటి రోజు గురువారం సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. 8వ తేదీన కుంబాభిషేకం, మహ శివరాత్రి వేడుకలు కొనసాగుతయన్నారు.

అష్టబంధనం కార్యక్రమంలో పండితులు

బాలికలకు స్టార్‌గర్ల్స్ పోటీలు

స్టార్ గర్ల్స్ విజేత భువనేశ్వరికి జ్ఞాపికను అందజేస్తున్న ఉపాధ్యాయులు

వనపర్తి, మార్చి 6: ప్రతి ఏడాది ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలోని బాలికలకు స్టార్ గర్ల్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలరాజు తెలిపారు. బుధవారం మండలంలోని నాగమ్మతండా పీఎస్‌లో ప్రపంచ మహిళా దినోత్సవా కార్యక్రమాన్ని పురస్కరించుకొని బాలికలకు అనేక అంశాలపై పోటీలను నిర్వహించారు. పోటీల్లో అధిక ప్లాయింట్స్ సాధించిన బాలికలకు స్టార్ గర్ల్స్ జ్ఞాపికను అందజేసినట్లు తెలిపారు. ఈ ఏడాది స్టార్ గర్ల్స్‌గా అన్ని అంశాల్లో పాల్గొని 700పాయింట్స్ సాధించిన 5వ తరగతికి చెందిన భువనేశ్వరికి అవార్డు అందజేసినట్లు తెలిపారు. అలాగే రన్నర్‌గా కృపా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాసుదేవయ్య, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి పాల్గొన్నారు.

దరఖాస్తుకు నేడే ఆఖరు

గద్వాల అర్బన్, మార్చి 6 : గ్రూప్–1 ప్రిలిమ్స్ ఉచిత శిక్షణకు కోచింగ్ దరఖాస్తుకు 7వ తేదీ అఖరి రోజు అని జిల్లా బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ప్రవీణ్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణకు డిగ్రీ అర్హత కలిగిన జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన నిరుద్యోగులు గురువారం సాయంత్రం 5గంటల లోగా జిల్లా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

గద్వాల అర్బన్, మార్చి 6 : మహిళలు వారికి సంబంధించి చట్టాలను తెలుసుకొని అన్ని రంగాల్లో ముందు ఉండాలని జిల్లా జడ్జి కుషా పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్జి కవితాదేవి, న్యాయవాదులు లక్ష్మణ్ ఉన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

వనపర్తి టౌన్, మార్చి 6 : ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వనపర్తి డిపోలో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ కండక్టర్లుగా సేవలందిస్తూ ఉత్తమ ప్రతిభ కనబర్చిన ముగ్గురు మహిళలను , బస్సులో ప్రయాణించే ముగ్గురు ప్యాసింజర్ మహిళలను సన్మానించారు. అనంతరం మహిళా కండక్టర్లు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సత్యమ్మ, బాలికల ఉపాధ్యాయురాలు చెన్నపద్మ, జిల్లా వెల్ఫేర్ అధికారి లక్ష్మీబాయి, డిపో మేనేజర్ వేణుగోపాల్, సహాయ మేనేజర్ దేవేందర్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ముగింపు సభకు హాజరుకండి

అయిజ, మార్చి 6: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 9,10 తేదీల్లో నిర్వహించనున్న పౌరహక్కుల సంఘం 50 వసంతాల ముగింపు సభకు ప్రజాస్వామికవాదులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు సుభాన్ కోరారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో ముగింపు సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో విజయ్‌భాస్కర్ రెడ్డి, మహేశ్, ఆంజనేయులు, నాగరాజు, సత్యన్న, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల చేస్తున్న పౌరహక్కుల సంఘం నాయకులు

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి

నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు

ఇటిక్యాల, మార్చి 6: తమ న్యాయబద్ధమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం భోజనవిరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. తమతోపాటు ఉద్యోగం పొందిన బీసీ సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు రెండుసార్లు పదోన్నతిని పొందారని, అలాగే తమకు పదోన్నతి రాకపోవడమే కాకుండా ఇప్పటివరకు బదిలీలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ప్రిన్సిపల్ ఆర్‌సీవోకు వినతిపత్రం అందజేశారు. తమ డిమాండ్ల సాధనకై 7వ తేదీన హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, భాస్కర్‌గౌడ్ ఉన్నారు.

విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు అందజేత

విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు అందజేస్తున్న ఉద్యమకారుడు టీజీ మహేశ్

కొత్తకోట, మార్చి 6 : మండలంలోని పాలెం జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న 56మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు తెలంగాణ ఉద్యమకారుడు టీజీ మహేశ్ ప్యాడ్స్, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీనారాయణ, లోకారెడ్డి, ఉపాధ్యాయులు, యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

మల్దకల్/ధరూరు/ చిన్నంబావి/పాన్‌గల్, మార్చి 6 : జిల్లాలోని ఆయా మండలాల్లో వివిధ పాఠశాలల్లో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించుకున్నారు. మల్దకల్ మండలంలోని బిజ్వారం ప్రాథమిక పాఠశాల , ధరూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, చిన్నంబావి మండలంలోని కొప్పునూరు ప్రాథమిక పాఠశాల, పాన్‌గల్ మండలంలోని కేతేపల్లి భగత్‌సింగ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో.. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్ఎంలు శివశంకర్, రేవతి, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు కిశోర్‌చంద్ర, లీలావతి, మస్రిన్ బేగం, కృష్ణకుమారి, రవి , చంద్రూనాయక్, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

ధరూర్ మండలకేంద్రంలో ఉపాధ్యాయులైన విద్యార్థులు

కొప్పునూరులో స్వయంపరిపాలన దినోత్సవం

ఆన్‌లైన్ మోసానికి యువకుడు బలి

కొత్తకోట, మార్చి 6 : కొత్తకోటకు చెందిన భాస్కర్ గౌడ్, సుధారాణి దంపతుల కుమారుడు శ్రీనివాస్‌గౌడ్ (26)డిగ్రీ పూర్తి చేశాడు. ఆన్‌లైన్ గేమ్‌కు అలవాటు పడి అప్పులు ఎక్కువ చేశాడు. గతంలో తన తండ్రి కొంత డబ్బును చెల్లించాడు. తిరిగి అప్పులు ఎక్కువగా కావడంతో మనోవేదనకు గురై హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో ఉంటున్న తన రూంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. తోటి స్నేహితులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం అనంతరం బుధవారం పట్టణంలో అంత్యక్రియలు నిర్వహించారు.

తైబజార్ వేలం @ రూ.3.05లక్షలు

మదనాపురం, మార్చి 6 : మదనాపురం గ్రామానికి సంబంధించి ప్రతిఏడాది నిర్వహించే తైబజార్ వేలాన్ని బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులు నిర్వహించారు. ఈ వేలంలో ముగ్గురు పాల్గొన్నట్లు పంచాయతీ కార్యదర్శి రంగస్వామి తెలిపారు. రూ.3.05లక్షలకు బోయ వెంకటేశ్ నాయుడు వేలాన్ని దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, మాజీ వార్డు సభ్యుడు చంద్రయ్య, జక్కుల నర్సింహ్మా, రాఘవేంద్ర, బాల్‌రాజు, శేఖరాచారి పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

గద్వాల అర్బన్, మార్చి 6 : అనుమానాస్పదంగా వ్యక్తి మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌక్‌లోని ఒక బిల్డింగ్‌పై నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు బుధవారం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించగా వ్యక్తి మృతి చెంది ఉండడం గుర్తించారు. అతడిని అలీపీర్‌గా గుర్తించగా ఆదివారం కర్నూల్‌కు వెళ్తున్న అని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయా ప్రాంతాల్లో వెతికారు. అలీపీర్ మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు మిత్రులు అనుమానం వ్యకం చేశారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఉండవెల్లి, మార్చి 6: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసిన ఘటన బుధవారం చోటుచేసుకున్నది. హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపిన వివరాలు మండలంలోని అలంపూర్ చౌరస్తా ఉత్తర పుడ్స్ వద్ద రెండు ట్రాక్టర్లు ఇసుకను తరలింస్తుండడంతో ఆర్ఐ సుచిత్ర పట్టుకునేందుకు ప్రయత్నించగా.. డ్రైవర్లు పరారయ్యారు. ఆర్ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

బాల్యవివాహాలు నేరం

పాన్‌గల్, మార్చి6 : బాల్యవివాహాలు నేరమని జిల్లా సంక్షేమాధికారి ఝాన్సీబాయి హెచ్చరించారు. మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ ఉన్నత పాఠశాలలో బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాంబాబు, నరేందర్, హేమాలత పాల్గొన్నారు.

చురుకుగా ఉపాధి పనులు

పెబ్బేరు, మార్చి 6: మండలంలో ఉపాధి హామీ పనులు చురుకుగా కొనసాగుతున్నట్లు ఎంపీడీవో రవీందర్ తెలిపారు. బుధవారం ఆయన జనుంపల్లి పంచాయతీ పరిధిలోని మునగమాన్‌దిన్నె వద్ద సాగు నీటి కాల్వలో నీటి సరఫరాకు అడ్డంకిగా ఉన్న చెట్లు, మట్టిని తొలగించే పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ Old Name : MOHAMMED JUNEID S/o KHAJA PASHA, New Name : **MOHAMMED JUNAID S/o MOHAMMED KHAJA PASHA,** Passport No: **H7050329 ,** R/o 6-1-81/3/B/2 Ganesh Nagar Street, MAHABUBNAGAR.

NT-MBNR

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.

NT-311802-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794